## నేడు సాయంత్రం 5 గంటలకు ప్రచారం బంద్

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, నవంబర్ 27 : మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారాలు బంద్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. ఈ తర్వాత ఒక్క నిమిషం ప్రచారంచ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పోలింగ్ సమయం వరకు ఎలాంటి ఇంటింటి, సోషల్ మీడియా ప్రచారం, మెసేజ్‌లు పెట్టినా చర్యలు తప్పవన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 95 శాతం ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. 889 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో 172 పోలింగ్ కేంద్రాల్లో ఇన్, అవుట్ సైడ్‌లలో వెబ్ కాస్టింగ్ చేస్తామని తెలిపారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంల తరలింపు కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో దివ్యాంగులు, వృద్ధుల ఓట్లు 1,008 ఉండగా ఇప్పటివరకు 92.5 శాతం పోలింగ్ పూర్తి అయినట్లు వివరించారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా పోలీసులతో పాటు 3,500 మంది కేంద్ర, ఇతర రాష్ట్రాల పోలీసులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 4 వేల మందిని బైండోవర్ చేసినట్లు, 460 మందిపై వారెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. 155 తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



చివ్వెంల : బీబీగూడెంలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

## మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతుగా సోమవారం విద్యార్థి, యువజన, ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు, మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత, బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో అలాగే ఆయా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 30 జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



సూర్యాపేట అర్బన్ : ప్రచారం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



బొడ్రాయిబజార్ : మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతుగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు




సూర్యాపేట టౌన్ : మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న యువ ఇంజినీర్లు

# బీఆర్‌ఎస్ గెలుపంటేనే ప్రజల గెలుపే

- కాంగ్రెస్, బీజేపీ కొంగ జపాన్ని నమ్మొద్దు
- అభివృద్ధి నిరోధకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- సంపద పెంచుతూ సంక్షేమాల రూపంలో పంచుతున్నం
- పెంచుకున్న సంపదను దోచుకునేందుకే విపక్షాల పోటీ
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట, ఆత్మకూర్.ఎస్‌లో విస్తృత ప్రచారం, ఆత్మీయ సమ్మేళనాలు



సూర్యాపేటలో రజకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, నవంబర్ 27 : బీఆర్‌ఎస్ పార్టీ గెలుపంటే.. అది ప్రజలందరి గెలుపే అని బీఆర్‌ఎస్ సూర్యాపేట అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అరవై ఏండ్లకు పైగా ఆగం చేసి మరోమారు మోసం చేసేందుకు నెరవేర్చలేని హామీలతో వస్తున్న కాంగ్రెస్, బీజేపీల కొంగ జపాలను ప్రజలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అభివృద్ధి నిరోధకులకు ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో మరోమారు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సోమవారం సూర్యాపేట నియోజకవర్గం వ్యాప్తంగా పలు మండలాల్లో రోడ్ షోలతో మంత్రి విస్తృత ప్రచారం నిర్వహించారు. అలాగే జిల్లా కేంద్రంలో రజక, గోల్డ్‌స్మిత్ వర్కర్స్, విశ్వబ్రాహ్మణ, మేరు సంఘాలు మంత్రికి స్వచ్ఛందంగా మద్దతు ప్రకటిస్తూ ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకుని మంత్రిని ఆహ్వానించాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో అన్ని విధాలుగా ఆగమైన సూర్యాపేటలో బీఆర్‌ఎస్‌కు ఓట్లేసి గెలిపించిన నాటినుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమాలతో ముందున్నామన్నారు. గత పదేండ్లుగా అందరి సమష్టి కృషితో అన్ని రంగాలను ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చేసి పెంచుకున్న సంపదనలు దోచుకునేందుకే విపక్షాలు పోటీపడుతున్నట్లు దుయ్యబట్టారు. కడుపు నింపిన బీఆర్‌ఎస్ కావాలో.. కడుపు మాడ్చి కష్టాలు కన్నీళ్ల పాలు చేసిన కాంగ్రెస్, బీజేపీ కావాలో ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. మరోమారు కారు గుర్తుకు ఓట్లేసి ఆశీర్వదిస్తే మిగిలిన అభివృద్ధితో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మరింత పెంచుకుందామని పేర్కొన్నారు. సమావేశాల్లో కొండూరు సత్యనారాయణ, చెరుకుపల్లి వెంకన్న, రంగు దిలీప్, అమరవాది శ్రవణ్, అన్నెపర్తి పద్మతో పాటు ఆయా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### రైతులను మోసం చేసిన మోసకారి దామోదర్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్ : పోచంపాడు పేరుతో వరుసగా ఆరు సార్లు ఓట్లు వేయించుకుని రైతులను మోసం చేసిన మోసకారి దామోదర్‌రెడ్డి అని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్.ఎస్ మండలంలోని రామకోటితండా, జగన్‌తండా, ఏపూరు, ఏనుబాముల, ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిపై మంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 30 ఏండ్ల దామోదర్‌రెడ్డి పాలనలో కనీసం మంచినీళ్లు లేవన్నారు. గ్రామాల్లో బోరుబావులు, పట్టణ ప్రజలకు పాయకాన నీళ్లు తాపించిన దుర్మార్గుడు దామోదర్‌రెడ్డి అన్నారు. ఆయన చేసిన పాపం వల్ల రైతుల మోటార్లు కాలిపోయి వారి జీవితం అదోగతి పాలైందన్నారు. రైతులే కూలీలతో కలిసి వలసలు పోవాల్సిన దారుణ పరిస్థితి ఉండేదన్నారు. ఆడపడుచులు బిందెలతో ధర్నాలు చేస్తుంటే బిందెలు తన్నుకుంటూ పోయిన పాపపు చరిత్ర దామోదర్‌రెడ్డి, ఆయన అనుచరులదని దుయ్యబట్టారు. పదేండ్ల కాలంలో దామోదర్‌రెడ్డి చేసిన ఆకృత్యాలను రూపుమాపుతూ పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇచ్చి ప్రజాస్వామికంగా పని చేస్తున్నటుల చెప్పారు. సూర్యాపేటలో దామోదర్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ నాయకులు సైతం ఇల్లు కట్టుకోవాలంటే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. ఇక వ్యాపారులు తమ దుకాణాలను వదిలి పరారైన సంఘటనలు కోకొల్లాలు అని తెలిపారు. పేరుకు వైట్ హౌస్ అయినా అక్కడ జరిగేది మాత్రం చీకటి పనులు అని ఆరోపించారు. పీక్కు తినడానికి నక్కలు, తోడేళ్లు సిద్ధంగా ఉన్నాయని సూర్యాపేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. 30 ఏండ్లలో ఎక్కడో ఒక్క రోడ్డు దామోదర్‌రెడ్డి వేశాడని తమ బీఆర్‌ఎస్ పాలనలో రూ.600 కోట్లతో వందలాది రోడ్లను సూర్యాపేట నియోజక వర్గం నలుమూలలా నిర్మించినట్లు తెలిపారు. మాట తప్పిన చరిత్ర తనకు లేదన్నారు. మళ్లీ ఆశీర్వదిస్తే సూర్యాపేటకు డ్రైపోర్ట్, ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ పరిశ్రమను విస్తరించి 20 వేల మందికి పైగా యువతీ యువకులకు ఉపాధి కల్పించనున్నటలు వెల్లడించారు. మంచి చేశానని అనుకుంటే ఆశీర్వదించండి మీ వెంట ఉంటా మీకు తోడై నిలుస్తా అని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ మర్ల స్వర్ణలతాచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, బత్తుల రాజేంద్రప్రసాద్, సర్పంచులు తంగెళ్ల వీరారెడ్డి, సానబోయిన రజిత సుధాకర్, ఎంపీటీసీలు మిర్యాల వెంకట్‌రెడ్డి, దామిడి మంజుల, తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మం, బోళ్ల వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూర్.ఎస్‌లో మంత్రి ప్రచారానికి హాజరైన ప్రజలు

### మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతుల పూజలు

సూర్యాపేట టౌన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా సూర్యాపేటలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. దీపారాదన చేసి నీలకంఠుడికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ మంత్రి దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మంత్రి జగదీశ్‌రెడ్డికి టీఎమ్మార్పీఎస్ మద్దతు

- టీ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాములుమాదిగ

చివ్వెంల, నవంబర్ 27 : మంత్రి జగదీశ్‌రెడ్డికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములుమాదిగ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ఖాసింపేటలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డికే మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్‌మాదిగ, మండల అధ్యక్షుడు ఎడవెల్లి రాము, ఎమ్మార్పీఎస్ నాయకులు ఈదయ్య, శ్యామ్, పరమేశ్, చిట్టిబాబు, అనీల్, శ్రవణ్, సంతు, సందీప్ పాల్గొన్నారు.



మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న టీ ఎమ్మార్పీఎస్ నాయకులు